


# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

### తప్పించుకు తిరుగువాడు

ఏమిటీ మనంకూడా ఇండియాలో ఇల్లు కొనుక్కుందామా?

ఇప్పుడు ఇండియాలో ఇల్లేం చేసుకుంటాం? ఇక్కడ నిక్షేపంలా ఇల్లు పెట్టుకుని?

ఏమిటీ కృష్ణారావుగారు ఇండియా వెళ్ళి కింగులా బతికేస్తున్నారా?

మనమూ ఇండియా వెళ్ళి దర్జాగా కాలుమీద కాలేసుకుని బతుకుదామా?

ఇప్పుడు మీ దర్జాకు లోటేమొచ్చిందటా?

అస్తమానం నన్ను డ్రైవింగు సీటులో కూర్చోపెట్టి, మీరు కాలుమీద కాలేసుకునే కదా తిరుగుతుంటా?

ఏమిటీ అక్కడకి వెళ్తే హాయిగా పనివాళ్ళని పెట్టుకుని అన్ని పనులు వాళ్ళతో చేయించుకుంటూ, నేను మహరాణిలాగా వుండచ్చా?

ఇదిగో ! ఇదే ముక్క 30 ఏళ్ళకిందట అన్నారు గుర్తుందా?

నేను 'అమెరికా వద్దండీ, అయిన వాళ్ళమధ్య ఇక్కడే వుందా'మన్నాను.

మీరు 'అమెరికా వెళ్తే అక్కడ హాయిగా వుండచ్చు. ముఖ్యంగా ఆడవాళ్ళకు అక్కడ లైఫు మూడు పూలు-ఆరు కాయలుగా వుంటుందీ' అని కల్లబొల్లి కబుర్లు చెప్పి నన్ను ఇక్కడకి తెచ్చి పడేసారు.

నేను అమెరికా అక్కర లేదన్నానని మీకు కోపమొచ్చింది.

ఇండియాలో వుంటే ఇలా అంట్లగిన్నెలు తోముకుంటూ, పచారీ షాపులో వెచ్చాలు తెచ్చుకుంటూ బతుకులు గడిపేయాలని నన్ను బెదరగొట్టారు.

మీరు గమనించారో లేదో, నేను అమెరికా వచ్చి కూడా అంట గిన్నెలు తోముకుంటూనే వున్నాను. పచారీ షాపుకెళ్ళి వెచ్చాలు తెచ్చుకుంటూనే వున్నాను. అందులో మార్పేమీ లేదు. ఇండియాలోనే వున్నట్టయితే, అప్పట్లో నా గిన్నెలు నేను తోముకున్నా, ఆ తర్వాత పనివాళ్ళను పెట్టుకుని సుఖపడేదాన్ని ! మీరు నన్ను ఇక్కడకి తెచ్చి నాకు ఒరగబెట్టిందేమీ లేదు. అమెరికా వస్తే అన్నీ ఆటోమాటిక్‌గా అయిపోతాయని, అంచేత ఆడవాళ్ళకు ఆవగింజంతైనా వర్రీ వుండదని నమ్మించారు. కానీ అమెరికాలో ఆడవాళ్ళకు అందులో నాబోటి వాళ్ళకు అన్నీ వర్రీలే అని ఇక్కడికొచ్చాకగానీ తెలీలేదు.

అమెరికా వచ్చి రోజూ ఆఫీసుకెళ్తే చాలు మీ బాధ్యత తీరిపోయిందనుకునే మహానుభావులు మీరు. మీకు తెలిసందల్లా మీపాటికి మీరు దర్జాగా బతికేయడం. అలా బతికేయడానికి మీరు ఏమైనా చేస్తారు. అప్పుడు సుఖపడటానికి అమెరికా వెళ్దాం అన్నారు. ఇప్పుడు సుఖపడటానికి ఇండియా అంటున్నారు. కానీ మీసుఖానికి వెనక ఓ ఆడదాని కష్టం, కృషి, సహనం, త్యాగం వున్నాయని మీకు తెలీదు. ఒకవేళ తెలిసినా తెలియనట్టు నటిస్తారు.

ఇన్నేళ్ళలో ఈ సంసారంకోసం నేను ఎన్ని ఇబ్బందులు పడ్డానో, ఎంత శ్రమించానో, ఎన్ని నేర్చుకున్నానో తెలుసా? అమెరికా అంటే ఐడియల్ ప్లేసు అనుకుంటారే తప్ప అమెరికా అంటే అయోమయం అని కూడా మీకు తెలీదు. దేశంలోనే వుంటే నా వాళ్ళ మధ్య నేను పెరిగిన సమాజంలో నాకున్న తెలివితేటలతో తేలిగ్గా పిల్లల్ని పెంచేదాన్ని. ఇక్కడ పిల్లల్ని పెంచటానికి, వాళ్ళను సరియైన దోవలో వుంచటానికి నేను ఎంత కష్టపడ్డానో మీకు తెలుసా?

మీ ఉద్యోగం పేరిట మీరు ఎప్పుడూ ఊళ్ళు పట్టుకొని తిరగడమే కదా. పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు వాళ్ళతో ఆటలాడింది నేను, వాళ్ళను స్కూళ్ళకు తీసికెళ్ళింది నేను, పిల్లలకు అనారోగ్యాలొస్తే డాక్టర్ల చుట్టూ తిరిగింది నేను, వాళ్ళ చదువుల గురించి విచారించేది నేను, కాలేజీలకు అప్లికేషన్లు పంపుతుంటే దగ్గరుండి చూసింది నేను, వాళ్ళను కాలేజీలో దింపేది నేను, వాళ్ళు ఇంటికొచ్చినప్పుడు మంచీ చెడ్డా కనుక్కుంటున్నది నేను.

ఇన్నేళ్ళుగా నేను ఈ సంసారాన్ని లాక్కొస్తూ మీకు అన్నీ అమర్చిపెడుతుంటే ఏ చింతా లేకుండా మీ కెరియర్ లో అంచెలంచెలుగా పైకి వెళ్ళి పేరు తెచ్చుకున్నారు.

ఇప్పుడు రిటైరై ఇంట్లో నెలరోజులుగా వుంటూ ఒక్కసారిగా కళ్ళు తెరిచారు. ఎంత చేస్తే ఇల్లు సజావుగా నడుస్తుందో ఇప్పుడిప్పుడే మీకు తెలిసొస్తోంది. అందుకే హడిలిపోయి ఇండియా వెళ్ళిపోదాం అంటున్నారు ! ఇక్కడే వుంటే ఇవన్నీ మీ నెత్తి మీద పడతాయని బెంబేలెత్తిపోతున్నారు. అందుకే ఇక్కడినుంచి పారిపోదాం అంటున్నారు !

అప్పుడు అక్కడి కష్టాల్ని తప్పించుకోడానికి అమెరికా అన్నారు. ఇప్పుడు ఇక్కడి ఇబ్బందుల్ని తప్పించుకోడానికి ఇండియా అంటున్నారు. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అని ---------

నేను ఎక్కడికీ రాను. మీ కల్లబొల్లి కబుర్లు నమ్మి కరిగిపోడానికి నేను వెనకటి కమలను కాను !